
పిల్లల లక్ష్యాల్ని పెద్దలే నిర్ణయిస్తే జరిగే విపరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఎంసెట్‌లో ర్యాంకు తెచ్చుకుంటే తప్ప బతుకు లేదన్న భ్రమల్లో కొట్టుమిట్టాడే తల్లిదండ్రుల్ని ప్రశ్నించే కథ ఇది. ఆశించిన ర్యాంకు రాలేదని కొందరు ఆత్మహత్యలు చేసుకుంటే, మరికొందరు మానసిక స్థైర్యాన్ని కోల్పోయి నిరాశోపహతులవుతారు. జీవితంలో మరేం సాధించలేమని నిర్ణయానికి వచ్చి దిగాలు పడతారు. ఈ నేపథ్యంలో పిల్లల చదువులపై శ్రద్ధచూపే తల్లిదండ్రుల ముందుగా తమను తాము చక్కదిద్దుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుందీ కథ.



డా. పులిపాటిగురుస్వామి

# సమిధ

సంధ్య గడియారం వైపు చూసింది.

రెండు గంటలు దాటి పది నిమిషాలయింది.

ఇప్పటిదాకా తనే గెలిచింది. ఇప్పుడు రాత్రి చేతిలో తన ఓటమి ప్రారంభమయింది.

కళ్లు మూతలుపడుతున్నాయి. మసకమసక చూపులోంచి, చదువుతున్న పుస్తకంలోని ఒక్కో గీత మూడు గీతల్లా కన్పిస్తోంది. కాసేపటికి మళ్లీ తూలి చదవడం మొదలెట్టినా సాగటంలేదు. అనుకోకుండానే నిద్రకి తలవంచింది.

నిన్నమొన్నటి వరకు రాత్రి పదకొండు గంటలవరకే చదివేది. కాని పరీక్షలు పదిహేను రోజులు మాత్రమే ఉండటం వల్ల మరో రెండుగంటలు పొడిగించింది. ఈసారి ఎలాగైనా మెడిసిన్‌లో సీటు సంపాదించాలనే పట్టుదల ఎక్కువైంది.

పోయినసారి ఇంటర్ కోసం, మెడిసిన్ ఎంట్రన్స్ కోసమూ కలిసి చదవడం వల్ల సీటు రాలేదని సంధ్య అమ్మానాన్నలు తెలిసిన వాళ్లందరితోనూ సంజాయిషీగా చెప్పుకున్నారు.

అందుకే ఈ సంవత్సరం పొడుగూతా కర్నూలు పంపించి, బాగా డిమాండ్‌వున్న చదువుల సంస్థలో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించాడు ఆమె నాన్న జనార్ధన్.

జనార్ధన్‌కు ఒక కూతురు, ఒక కొడుకు. కూతురు పెద్దది. కొడుకు ఈ ఏడు పదో తరగతిలోకి వస్తాడు. రెవిన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం. పైరాబడి కూడా బాగానే వుంది. ఎంత ఖర్చు అయినా సరే, కూతురును డాక్టర్ని చేయాలనేది ఆయన వాంఛ. అందుకు ఓ కారణం వుంది- తన అన్నగారి కుటుంబంలో ఇద్దరు డాక్టర్లున్నారు. తన షడ్రకుని కూతురు కూడా మెడిసిన్ చదువుతోంది. బంధువుల్లో తన పరపతి కూడా కూతురు చదువు వల్ల పెరుగుతుందన్నది ఆయన నమ్మకం. అందుకే సంధ్యను మెడిసిన్ చదివించాలని ఆయన నిర్ణయించుకున్నారు.

ఖరీదైన వస్తువులు, ఇల్లు జీవన విధానాన్ని పరపతిని తెలిపినట్లుగానే పిల్లల చదువులు కూడా స్టేటస్ సింబల్స్‌గా మారిపోయాయి. ఎంత ఎక్కువ డొనేషన్లు, కోచింగులు ఇప్పించి చదువులు కొంటే అంత గొప్పతనంగా మారిన రోజులు. ఈ విషయాన్ని జనార్ధన్ భార్య జంకకుండానే ఇంటికి వచ్చిన వాళ్ళతో చెప్పేస్తోంది.

"మా అమ్మాయికి ఈ ఏడు తప్పకుండా మెడిసిన్‌లో సీటొస్తుంది. పగలనక రాత్రనక కష్టపడుతోంది. మేము కూడా ఇప్పటికే యాభై అరవైవేల దాకా దాని కోచింగులకి, పుస్తకాలకి ఖర్చుపెట్టాం" అని అడగకున్నా చెప్తూనే ఉంటుంది.

"అసలు మా అమ్మాయి మెడిసిన్ తప్ప మరోటి చదవనంటుంది" అని కూడా చెబుతోంది.

ఇదంతా పక్క గదిలోని సంధ్య వింటూనే వుంటుంది. తనకలాంటి కోరిక లేవీ లేకున్నా తల్లిదండ్రులకు మాత్రం చాలా అవసరమని తెలుసుకుంది. దానికి తగ్గట్టుగానే తన శాయశక్తులా చదువుతూ వుంది.

ఏ వారానికో పదిరోజులకోగాని బయటకు వెళ్ళడంలేదు సంధ్య. అదీ అరగంటసేపే తన స్నేహితురాలి దగ్గరకు వెళ్తుంది. కర్నూలులో కోచింగ్ తీసుకొని వచ్చిన దగ్గర్నుండీ తన గదిలో తానే ఖైదీలా ఉంటోంది. ఎప్పుడో అలసిపోయి తల పైకెత్తి పైకప్పుకు చూస్తూ గట్టిగా ఊపిరి తీసుకుంటుంది. అక్కడి ఓ బల్లి తనని రోజూ చూస్తూ ఉంటుంది. బల్లంటే తనకు చాలా భయం. అదెప్పుడూ ఆ గది గోడల మీద తిరుగుతూ, ట్యూబులైటు చుట్టూతా వాలే పురుగుల్ని తింటూ ఉంటుంది. దానికి మరో పనేమీలేదు. తనలా పరీక్షలు రాయాల్సిన అవసరంలేదు. తనలా ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. దొరికితే తింటుంది. లేకుంటే పడు కుంటుంది. మనుషుల్లోలా బల్లుల ప్రపంచంలో కాంపిటేషన్లు లేవు. స్టేటస్‌ల గొడవలేదు. ఉంటే వాటికి కూడా ఈ

మానసిక ఒత్తిడి తప్పేదికాదేమో!

కాసేపు ఆలోచించి మళ్లీ పుస్తకంలోకి దూరిపోతుంది. తను ఈమధ్య ముఖం కూడా రోజూ ఏ రెండుసార్లో కడుక్కుంటోంది. జడకూడా సరిగ్గా వేసుకోవడంలేదు. ఎప్పుడైనా చిక్కులు తీసుకుందామని కూచుందా- 'దాంతో ఇప్పుడు పనేంటే టైమెందుకు వేస్టు చేసుకుంటావ్' అంటూ అమ్మ.

ఎప్పుడైనా తండ్రి వచ్చే సమయానికి టివి ముందో, హాల్లోనో కూచుంటే చాలు- సమయాన్ని గురించి దాని విలువను గురించీ, డాక్టరు వృత్తిని గురించీ దాని హోదాను గురించీ, ప్రజల్లో పరపతిని గురించీ ఓ ఉపన్యాసం నాన్న నుండి వినాల్సిందే. అందుకే అన్నీ మానుకొని గదిలోనే ఉండిపోతుంది. తను బాగా అలసిపోయినప్పుడు కాసేపు గోడమీది బల్లిని చూస్తూ దాని స్వేచ్ఛ గురించి ఆలోచిస్తూ ఉంటుంది.

బల్లికి మాత్రం సంధ్యను చూసినప్పుడల్లా జాలిగా వుంటుంది. తనకు ఆహారం దొరకని సమయాల్లో సంధ్యనే చూస్తూ వుండటం దానికి అలవాటు. తల్లిదండ్రులు సంధ్యపై తెస్తున్న వత్తిడికి బాధపడుతుంది.

** ** **

గవర్నమెంటు నిర్ణయించిన ఓ శుభ ముహూర్తాన ఎంసెట్ ఎంట్రన్స్ పరీక్ష జరిగింది. తల్లిదండ్రులు వెంటరాగా సంధ్య విజయవంతంగా పరీక్ష రాసింది. హాల్లోంచి బయటకు రాగానే బల్లి గుర్తొచ్చింది. స్వేచ్ఛగా ఊపిరి తీసుకుంది. గొప్ప బరువు తన మీదినుంచి తొలగిపోయింది.

అమ్మాయికి తప్పకుండా సీటొస్తుందని అంతదూరంలో నవ్వుకుంటూ వస్తున్న సంధ్యను చూడగానే అనుకున్నారు జనార్ధన్, అతని భార్య. ఒకసారి తన అన్నగారిని, సడ్డకుణ్ణి గుర్తుచేసుకొని వాళ్ళతో సమానంగా గర్వంగా నిల్చున్నట్లు ఓ చిత్రపటం మెదిలిం



ది అతనికి. సంధ్యను కౌగిలించుకున్నంత పనిచేసింది అమ్మ. పరీక్ష రాసిన ఆనందమే ఇంతైతే మంచి ర్యాంకు వస్తే ఎంత తబ్బిబ్బైతారో.

ఏ దురదృష్టమో ఎదురై ర్యాంకు రాకపోతే వీళ్లెలా రిసీవ్ చేసుకుంటారు? ఒక్కక్షణం ఆలోచించి భయపడి మళ్లీ వారి ఆనందంలో కలిసిపోయింది సంధ్య.

ఇరవై రోజుల తర్వాత ముందుగా ఎంసెట్ ప్రశ్నపత్రం 'కీ' ప్రకటించారు సంబంధిత డిపార్టుమెంట్ వారు.

సుమారుగా 'కీ' చూసుకొని తనకొచ్చే మార్కుల్ని, ర్యాంకునీ అంచనా వేసుకుంది సంధ్య. తనకు సంతృప్తిగానే వున్నా ఏమౌతుందోననే దిగులు పరీక్ష రాసిం దగ్గర్నుండీ వెన్నాడుతూనేవుంది.

ఒకనాటి ఉదయం, రేపు వచ్చే ఫలితాల గురించిన వార్త గుండె వేగాన్ని పెంచింది. తల్లిదండ్రులను చూడ్డానికి కూడా భయంవేసింది సంధ్యకు. ఆ ఒకటిన్నర రోజు సమయాన్ని ఒకటిన్నర టన్నుల భారంగా మోసింది.

ఫలితాలు ప్రకటించే రోజున జనార్ధన్ ఆఫీసుకు సెలవు పెట్టాడు. మధ్యాహ్నం నుండే పేపరు కోసం రోడ్డుమీద నిల్చున్నాడు. గుంపులో ఎగబడి ఎగబడి పేపరు కొనుక్కొని వచ్చాడు. గబగబా వెతికాడు నంబరును. సంధ్య, తల్లి ఆదుర్దాగా అతని నుండి వచ్చే వాక్యం కోసం చూస్తున్నారు. సంధ్య నంబరు పక్కన 5350 ర్యాంకును పైకి చదివాడు. ఆ ర్యాంక్ జనార్ధన్‌ను నిరుత్సాహపరిచింది. సంధ్య మీదికి పేపరు విసిరికొట్టాడు.

సంధ్యకు ఏడుపు రావడం, అక్కడినుండి తన గదిలోకి వెళ్ళడమూ ఒకేసారి జరిగాయి. సంధ్య తల్లికూడా ఆమెను అనుసరించింది ఏడుస్తూ.

జనార్ధన్ ఇలా జరుగుతుందని ఊహించనేలేదు. పట్టరాని కోపంతో బిగ్గరగా అరుస్తున్నాడు.

'అనవసరంగా చదివించాను. అయిన ఖర్చుకు ఇంకో యాభైవేలు కలిపితే పెళ్ళి అయిపోయేది"

'అదృష్టముండాలి దేనికైనా'

'పెద్ద చదువులు చదవాలని మనం అనుకుంటే సరా! పిల్లలనుకోవాలి కదా!'

'బంధువుల్లో తలెత్తుకోకుండా చేసింది'

'ఎన్నో ఆశలు పెట్టుకొని అందరికీ చెప్పుకున్నాను నా బిడ్డ డాక్టరౌతుందని'

'ఎప్పుడు చూసినా చదువుతూనే వుండేది. ఏం చదివిందో ఏమో'

ఒక్కొక్క మాట గదిలో వున్న సంధ్యను విపరీతంగా గుచ్చుకొని బాధపెడుతున్నాయి. సంధ్య తల్లి బయటకొచ్చి జనార్ధన్‌ని ఏమీ అనవద్దని వారించింది. చాలాసేపు వెక్కివెక్కి ఏడ్చిన సంధ్య అలసటతో బెడ్‌మీద వాలిపోయింది.

గదిలో నిశ్శబ్దం. గోడమీద బల్లి మెల్లగా కదిలింది. సంధ్యను చూసి భయమేసింది. ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లిపోయింది. సమాజంలో చదువు వ్యాపార వస్తువుగా, స్టేటస్ సింబల్‌గా మారి కొడుకులను, కూతుళ్ళను పావులుగా చేసినందుకు విచారించింది.

సంధ్యకు మెలకువ వచ్చేసరికి అర్ధరాత్రి ఒంటిగంట కావస్తోంది. తన గది తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. లేచి బోల్టు పెట్టి ట్యూబ్‌లైట్ వేసింది.

తన సంవత్సర కాలం వృధా అయినందుకు బాధపడింది. అంతకంటే తన తల్లిదండ్రుల్ని నిరుత్సాహపరిచానని కలత చెందింది. తన స్నేహితులకు ముఖం చూపించడం కష్టంగా తోచింది. విపరీత ఆలోచనలతో తలంతా బరువెక్కింది. గోడమీదికి చూసింది. బల్లి తనవైపే చూస్తోంది. 'నువ్వూ తిడుతున్నావా? నీకు బిడ్డనైనా బావుండు' అనుకుంది.

చాలాసేపు తనలోతనే మథనపడి, ఏడ్చి గదిలో అటూఇటూ తిరిగింది. ఈ విలువలు ఆశించే మనుషుల మధ్య, ఈ పోటీ ప్రపంచం మధ్య ఓడిపోతూ బతకడం కంటే చావే మేలనుకుంది. ఆ క్షణంలో చావు తప్ప మరో దిక్కులేదని తలపోసింది. బతికి వుంటే ఇంటాబయటా ఎదురయ్యే తలవంపులకన్నా చావే నయమని తలచింది. అంతే, తన చీరనొకదాన్ని ఫాన్ మీదికి విసిరి కింద స్టూలు పెట్టుకుంది.

జరిగే సన్నివేశం బల్లికి అర్థమైంది. గబగబా పాకి ఫాన్ మీదినుండి చీరమీదికి దూకింది.

బల్లి తనకు చాలా భయం. అది మీద పడుతుందేమోనని చాలాసార్లు కెవ్వుమని అరిచిన సందర్భాలున్నాయి. కాని ఇప్పటి బీభత్స పరిస్థితిలో ఆ భయం సంధ్యనేమీ చేయలేదు. ఒక్కసారి బలంగా చీరని ఊపగానే బల్లి ధబేల్న నేలకూలింది.

జరిగే దారుణాన్ని చూడలేక బల్లి అరుస్తూ బీరువా కిందికి చేరిపోయింది.

** ** **

ఆ రోజు కూడా మామూలుగానే తెల్లవారింది. మామూలుగానే మనుషులందరూ నిద్రనుండి లేచారు. జనార్ధన్, ఆయన భార్య, కొడుకు కూడా.

సంధ్య గది తలుపులు తెరవకపోవడంతో తల్లికెందుకో అనుమానం వచ్చింది. వెళ్లి తలుపు తట్టింది. జనార్ధన్ కూడా వచ్చి తట్టాడు. ఏదో శంక గుండెల్లో. గట్టిగా తలుపులు బాదారు. కిటికీల వైపు నుంచి పిలిచినా ఫలితం లేదు. సగంసగంగా ఏదో జరిగుంటుందని ఆ కుటుంబంలో తెలిసి ఏడుపులు బయటికొచ్చాయి. చుట్టుపక్కల వాళ్లు గుమికూడారు. చివరికి తలుపులు పగులకొట్టారు.

జనార్ధన్ కన్నకల వేలాడుతోంది.

తన స్టేటస్ సింబల్ ఉరితాడు ముడిలో చిక్కుకుంది.

తన బంగారు కూతురు పోటీ పరీక్షల ఉచ్చుకు వేలాడుతోంది.

** ** **

సంధ్య చనిపోయిన పదవరోజు పేపర్లో ఓ వార్త వచ్చింది. ఎంసెట్ 'కీ'లో ప్రశ్నాపత్రాల్లో కొన్ని తప్పులు దొర్లాయని, 'కీ' సవరించిన పిదప 'ఐదు' మార్కులు కలుపనున్నారని, తద్వారా మారిన ర్యాంకుల్ని తిరిగి ప్రకటించనున్నారని.

ఆ వార్త చదివిన జనార్ధన్ గుండె విలవిల్లాడింది. బిగ్గరగా ఏడ్చాడు. 'ఎందుకురా మా పిల్లల జీవితాలతో ఆడుకుంటారు? మిమ్మల్ని నమ్ముకున్నందుకు మా పిల్లల్ని నాశనం చేసుకుంటున్నాంరా' అంటూ మండిపడ్డాడు. 'ఐదు మార్కులు కలపడం వల్ల నా కూతురుకి ర్యాంకు వస్తే వస్తుందేమో! నా కూతురిని ఎక్కడినుండి తేగలరు?' అంటూ విలపించాడు. ప్రభుత్వాన్నీ. చదువుల్నీ విపరీతంగా తిట్టిపోశాడు.

బంధువులు, స్నేహితులు చాలామంది ఓదార్చారు జనార్ధన్ కుటుంబాన్ని. ప్రభుత్వపు పరీక్షా విధానాల మీద రకరకాలుగా విరుచుకుపడ్డారు.

అనుకున్నట్టుగానే సంధ్యకి తరువాత ప్రకటించిన ర్యాంకుల్లో మంచి ర్యాంకు వచ్చింది. హైదరాబాద్‌లో కాకున్నా మరోచోటైనా మెడిసిన్‌లో సీటు వచ్చేది. అది తెలిసాక మరింత దుఃఖంతో కుమిలిపోయారు జనార్ధన్, అతని భార్య.

సంధ్య మిత్రులు, టీచర్లు, సంధ్యను తెలిసినవాళ్లు చెప్తున్న సంతాప వాక్యాలు, ఓదార్పు వాక్యాలూ తనని నేరస్థునిగా భావిస్తున్నట్టు తోచాయి జనార్ధన్‌కి. బిడ్డల్ని కనాలేగాని, వాళ్ళు ఏం చేయాలో కూడా తామే నిర్ణయించాలనుకుంటే జరిగే పరిణామాలు ఎంత ఘోరంగా ఉంటాయో ఆయనకి అర్థమవుతున్నాయిప్పుడు. నిజానికి తనే ఒకరకంగా కూతుర్ని హత్య చేశానని మనసులో కుమిలిపోతున్నాడు. చేతులు కాలాక ఆకులు పట్టుకొని లాభం ఏమిటి?

సంధ్య పోయాక ఒంటరిదైన బల్లి మనుషుల మీద అసహ్యంతో గది వదిలి వెళ్ళిపోయింది.

నిర్జీవంగా సంధ్య గది సమాజాన్ని వెక్కిరిస్తూ వుంది.

ఇవేవీ పట్టని కొందరు– 'ఆ మాత్రానికే చావాలా! చస్తుందా! ఏదో ప్రేమ వ్యవహారం నడిపి వుంటుంది, బెడిసికొట్టిందేమో' అంటూ గుసగుసలు పోయారు.

◉

గదిలో నిశ్శబ్దం. గోడమీద బల్లి మెల్లగా కదిలింది. సంధ్యను చూసి భయమేసింది. ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లిపోయింది. సమాజంలో చదువు వ్యాపార వస్తువుగా, స్టేటస్ సింబల్‌గా మారి కొడుకులను, కూతుళ్ళను పావులుగా చేసినందుకు విచారించింది.
సంధ్యకు మెలకువ వచ్చేసరికి అర్ధరాత్రి ఒంటిగంట కావస్తోంది. తన గది తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. లేచి బోల్టు పెట్టి ట్యూబ్ లైట్ వేసింది.

సంధ్య గది తలుపులు తెరవకపోవడంతో తల్లికెందుకో అనుమానం వచ్చింది. వెళ్లి తలుపు తట్టింది. జనార్ధన్ కూడా వచ్చి తట్టాడు. ఏదో శంక గుండెల్లో. గట్టిగా తలుపులు బాదారు. కిటికీల వైపు నుంచి పిలిచినా ఫలితం లేదు. సగంసగంగా ఏదో జరిగుంటుందని ఆ కుటుంబంలో తెలిసి ఏడుపులు బయటికొచ్చాయి. చుట్టుపక్కల వాళ్లు గుమికూడారు. చివరికి తలుపులు పగుల కొట్టారు.
జనార్ధన్ కన్నకల వేలాడుతోంది.
తన స్టేటస్ సింబల్ ఉరితాడు ముడిలో చిక్కు కుంది.

## మతిమరుపు

"డాక్టర్! డాక్టర్! నాకు అప్పుడప్పుడూ మతిమరుపు వస్తుందండీ ఏం చేయాలి?"

"కరెక్టే ఇది పశువుల ఆస్పత్రి నాయనా! అలా పక్కకు వెళ్ళండి! ప్లీజ్!"

– ఎల్.పి. చంద్ర,
ధర్మవరం